# కల్లోలం

ఆకాశంనిండా అంధకారం.

అందులోంచి తారలు తొంగి చూస్తున్నాయి.

ఆమె వణుకుతున్న హస్తాలతో రామయ్య పాదాలు తాకింది. ఆమె బరువైన నేత్రాలనుంచి వేడి కన్నీటి బిందువులు రాలాయి. మగత నిద్రలోనున్న రామయ్య మేల్కొన్నాడు. నిర్ఘాంతపోయి నిలుచున్నాడు.

"అమ్మగారూ! యిలా వచ్చారేం?"

ఆమె వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది.

రామయ్య అదే మళ్ళీ ప్రశ్నించాడు. ఆమె దుర్భరమైన దుఃఖంతో అతని పాదాలమీద వాలింది.

"రామయ్యా! నన్ను క్షమించవూ?"

అతనికంతా అయోమయంగా ఉంది.

"నేనే ఆ మహాపాతకిని. మీ వంశానికి కళంకం తెచ్చాను."

రెండు దినాలు క్రితం ఆమె అతనిముందు విన్నవించుకున్న తన ఆత్మకథ జ్ఞప్తికి వచ్చింది. అతడుగ్రుడయినాడు.

అవి రామయ్య ఆమె వద్ద నౌకరుగా చేరిన మొదటిరోజులు. స్వగ్రామం విడిచి రామయ్య దేశద్రిమ్మరియైనాడు. అతని మనఃశాంతి నశించింది. తిరిగి తిరిగి ఆ పట్నం చేరాడు. ఏదో జీవనోపాధి చూసుకుని కాలక్షేపం చేద్దామనుకున్నాడు. ఒకనాడు ఏమైనా పని ఇప్పించమని ఆమెను వేడుకున్నాడు. ఆమె కనికరించి నౌకరుగా చేసింది రామయ్యను.

రామయ్యకు 18 ఏండ్ల ప్రాయంలోనే వివాహం జరిగింది. కొడుకు కోడలు చిలకా గోరింకల్లా కాపురం చేస్తూంటే చూడాలని అతని తల్లితండ్రులు ముచ్చటపడ్డారు, చదువుకున్న పిల్లగదా అని. కొంచెం యించుమించు అతని వయస్సులోనే వున్న కాంతాన్ని అతనికిచ్చి పెండ్లిచేశారు. కాంతం మొదట్లో ఆ వివాహాన్ని ఒప్పుకోలేదు. రామయ్య తండ్రి ఆ వూర్లో పేరున్న పెద్ద నాయుడని అతనితో సంబంధం కలుపుకోడం

తమకు గౌరవం అని ఆమె తల్లిదండ్రులు బలవంతం చేసికాంతాన్ని ఒప్పించారు. వివాహమయినా రామయ్యమీద ఆమెకు ప్రేమ ఉండయించలేదు. అతన్ని ఎప్పుడూ ఏవగించుకునేది. రామయ్యకు కాంతం అంటే ఏమిటో చెప్పలేని అభిమానం. ప్రేమ. కాలం గడిచింది కాని, వారి హృదయాలు కలువలేదు.

ఒకనాడు కాంతం యింట్లో కనిపించలేదు. అంతా వెదికారు. ఎన్ని దినాలు గడిచినా ఆమె జాడ కనుక్కోలేకపోయారు. రామయ్య మనస్థిమితము చెడింది. కాంతాన్ని కనుక్కుంటేగాని యింటికి రానని బయలుదేరాడతను. ఆమెను గురించి అందరూ అనేక విధాలుగా చెప్పుకున్నారు.

అప్పటినుంచి ఆరు సంవత్సరాలుగడిచాయి తన ప్రథమ వీక్షణంలోనే ఆమె అతని హృదయాన్ని కలవరపెట్టింది. ఆ కలత తిరిగి స్ఫురణకు వచ్చింది.

ఆమె అతని వదనంలోకి దీనంగా చూసింది. రామయ్య విశాలఫాలము ముడుతలు పడింది. కనుబొమల మధ్యనుంచి చెమట బిందువులు రాలాయి.

కనకరెడ్డి గారడీవిద్యలో ఘనుడు. రామయ్యతో మొదట పరిచయం కలిగించుకుని కనకరెడ్డి ఆ వూళ్ళో గారడీ చేసేవాడు. రెడ్డికి, రామయ్యకు స్నేహం ముదిరింది. రాకపోక లధికమయ్యాయి. ఆ కాలంలో రెడ్డి కాంతాన్ని మభ్యపెట్టి చేరదీశాడు. కామవాంఛ తీరాక రెడ్డి కాంతాన్ని ఒంటరిజేశాడు. తనకు జరిగిన మోసం గుర్తించింది కాంతం! పశ్చాత్తాపంతో క్రుంగింది.

తిరిగి యింటికి వెళ్ళడానికి మొహం చెల్లలేదు. ఉన్న నగలు తెగనమ్మింది. ఆడపిల్లల బడిలో పంతులమ్మగా జేరింది ఈ పట్నంలో.

ఇంటిదగ్గర వుండడాన్కి ఎవరో ఒక నౌకరుని పెట్టదలచుకుంది. రామయ్య తన ఆత్మకథ చెప్పిన మరుక్షణంనుంచి అతని ముందు తల యెత్తుకోలేక పోయింది. అంతకుముందు పశ్చాత్తాపం ఆమె హృదయాన్ని దహించింది. ఆపలేని విషాదంతో అతని పాదాల నాశ్రయించింది. తన దుశ్చరిత్రకు క్షమాపణ వేడింది.

లోకం రామయ్యనుచూచి వెకిలిగా నవ్వింది. ఆ నవ్వులోని అంతరార్థం అతనికి తెలుసు.

అతనిది అమాయక ప్రేమ అని లోకం అంటుంది.

"కాదు! కాదు! అగ్నిజ్వాల" అని రామయ్య అంటాడు.

ఈ వివాదంలో కాంతం జీవితం జవాబు లేని ప్రశ్నార్థకమయింది!